బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 26 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## సీఎన్‌జీ ధరల పెంపు




**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా ఢిల్లీ మినహా మిగిలిన నగరాల్లో సీఎన్‌జీ ధర పెరిగింది. కిలో సీఎన్‌జీకి రూ.2 చొప్పున పెంచారు. ఢిల్లీ శాసన సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ నగరానికి ఈ పెంపుదల నుంచి మినహాయించినట్లు కనిపిస్తున్నది. ఇన్‌పుట్ కాస్ట్ 20 శాతం పెరిగినప్పటికీ ఎంజీఎల్, అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ వంటి సిటీ గ్యాస్ రిటెయిలర్స్ గత రెండు నెలలపాటు సీఎన్‌జీ ధరలను పెంచలేదు. మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ నెల 22 నుంచి ఎంజీఎల్ రూ.2 పెంచింది. దీంతో కేజీ సీఎన్‌జీ ధర రూ.77కు చేరింది. సీఎన్‌జీ ధరలు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా ఉంటాయి. దీనికి కారణం వ్యాట్ వంటి స్థానిక పన్నులు వేర్వేరుగా ఉండటమే.

# అదానీ 'రూ.100 కోట్లు' తిరస్కరణ



- సీఎస్ఆర్ కిందే ఆ గ్రూప్ విరాళాన్ని ప్రకటించింది
- నాపైనా, మంత్రులపైనా దుష్ప్రచారం తగదు
- అనవసర వివాదాల్లోకి సర్కారును లాగొద్దు
- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. స్కిల్స్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని తిరస్కరించినట్లు ప్రకటించారు. ఈ మేరకు అదానీ సంస్థకు లేఖ రాశామన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి అదానీ వ్యవహారానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తమ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ విషయంపై హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాసరెడ్డి , సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ , ఇతర నేతలతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.

అదానీ గ్రూపునకు సంబంధించి దేశ విదేశాల్లో దుమారం చెలరేగడం, ఆరోపణలు, ప్రత్యారోపణలు, చర్చోపచర్చలకు దారితీసిన తరుణంలో అలాంటి వివాదాల్లో తెలంగాణను చేర్చడం ఇష్టంలేక మంత్రులందరం కలిసి అదానీ ఫౌండేషన్ విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు... యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కి ప్రకటించిన నిధులను బదిలీ చేయరాదని అదానీ ఫౌండేషన్ చైర్ పర్సన్‌కు పరిశ్రమల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గారు ఈనెల 24 వ తేదీన లేఖ రాశారు.

అదాని ఫౌండేషన్‌కు ఇప్పటికే లేఖ రాసిన విషయాన్ని సీఎం ప్రస్తావిస్తూ, స్కిల్స్ యూనివర్సిటీ సీఎస్ఆర్ నిధుల కింద అనేక సంస్థలు విరాళం ప్రకటించినప్పటికీ ఇప్పటికి ఒక్క రూపాయి కూడా తెలంగాణ ఖాతాకు బదిలీ కాలేదన్నారు. స్కిల్స్ యూనివర్సిటీకి అవసరమైన కార్పస్ ఫండ్ కోసం ఆయా సంస్థలు ఇచ్చే నిధులపై 80జీ కింద ఆదాయపన్ను మినహాయింపు నిన్నమొన్ననే వచ్చిందని చెప్పారు. ఆ కారణంగా ఇప్పటివరకు ఏ సంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని అన్నారు. తాజా వివాదాల నేపథ్యంలో అదానీ ఫౌండేషన్ ప్రకటించిన నిధులను బదిలీ చేయొద్దని లేఖ రాయడం జరిగిందని తెలిపారు.

తెలంగాణ యువత ప్రపంచంతో పోటీ పడాలన్న సదుద్దేశంతో ఒక గొప్ప ఆలోచనతో ప్రారంభించిన స్కిల్స్ యూనివర్సిటీపై వివాదాలు రాకూడదనే అదానీ గ్రూపు విరాళం వద్దనుకుంటున్నట్లు చెప్పారు. అయితే, ఈ నిధుల విషయంలో కూడా రాజకీయ కోణంలో ఆరోపణలు చేయడం నిరుద్యోగ యువకులకు నష్టపరిచే విధంగా కొందరు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనించాలని కోరారు. చట్ట బద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా ఏదైనా కార్యక్రమంపై టెండర్లు పిలిచినా, పెట్టుబడులు పెట్టినా కచ్చితమైన నియమ నిబంధనలతో అన్ని సంస్థలు పాల్గొనేలా అవకాశం కల్పిస్తామని, నిబంధనల ప్రకారం ఏ సంస్థకు దక్కితే వారికి కాంట్రాక్టులను కేటాయించడమన్న విధానం అనుసరిస్తున్నామని స్పష్టం చేశారు.

ఎవరికీ ఆయాచిత లబ్ది చేకూర్చే నిర్ణయాలను ప్రజా ప్రభుత్వం తీసుకోబోదని పునరుద్ఘాటించారు. అదానీ అయినా, అంబానీ అయినా, టాటా బిర్లాలైనా మరే ఇతర సంస్థ అయినా పెట్టుబడులు పెట్టడానికి అవకాశం ఉంటుందనే కాంగ్రెస్ విధానం రాహుల్ గాంధీ గారు ఇదివరకే తేల్చిచెప్పినట్లు సీఎం గారు గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణకు సంబంధించి కేంద్రం వద్ద ఉన్న పెండింగ్ అంశాలపై మంగళవారం రాష్ట్ర ఎంపీలతో ఢిల్లీలో చర్చిస్తామని తెలిపారు. ఎయిర్ పోర్టు, మెట్రో విస్తరణ, సాగునీటి కేటాయింపుల వంటి ప్రధానమైన అనేక పెండింగ్ అంశాలలో కేంద్రంపై ఒత్తిడి తెస్తామని, అనుకూలతను బట్టి పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర మంత్రులను కలుస్తామని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గొప్ప ఉద్దేశంతో ప్రారంభించిన స్కిల్స్ వర్సిటీని వివాదాల్లోకి లాగడం తనకు, తన సహచర మంత్రులకు ఇష్టం లేదన్నారు. స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు వివాదం చేస్తున్నారని, వీటికి చెక్ పెట్టేందుకు సీఎస్ఆర్ కింద అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరామన్నారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగితే నిరుద్యోగులు నష్టపోతారన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థకు ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. అదానీతో బీఆర్ఎస్ నేతలు కమీషన్లు తిన్నారన్నారు. కేటీఆర్ జైలుకెళ్లాలని తహతహలాడుతున్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవుతారని భావిస్తున్నారని, అలా అయితే కేసీఆర్ కుటుంబంలో కవిత జైలుకు వెళ్లారని ముందుగా కవిత సీఎం అవుతారన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. తన ఢిల్లీ పర్యటనలపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఢిల్లీ పర్యటనకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని విమర్శిస్తున్నారని, తాను పైరవీలు, బెయిల్ కోసమో ఢిల్లీ వెళ్లలేదన్నారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసం ఢిల్లీ వెళ్తున్నామన్నారు. రేపు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలపై మాట్లాడతామన్నారు.

## అదానీ వ్యవహారంపై
# దద్దరిల్లిన పార్లమెంట్




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పార్లమెంటు ఉభయ సభలు సోమవారం దద్దరిల్లాయి. తర్వాత బుధవారం వరకూ వాయిదా పడ్డాయి. అమెరికాలో అదానీ లంచాల కేసు, మణిపూర్, యూపీలోని సంభాల్‌లో హింస, వాయనాడ్ బాధితులకు సహాయం సహా వివిధ అంశాలపై చర్చకు ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టి, నినాదాలు చేసిన నేపథ్యంలో సభలను వాయిదా వేశారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకుని 75 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక ఉత్సవం నిర్వహించనున్నారు. దీనితో మంగళ వారం సమావేశాలు లేవు.

పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభం అయ్యాయి. తొలుత ఇటీవలి కాలంలో మరణించిన పార్లమెంటు సభ్యులకు సభ నివాళు లర్పించింది. సాధారణ కార్యకలాపాల కోసం మధ్యాహ్నం సభ ప్రారంభం కాగానే అమెరికాలో అదానీ లంచాల కేసు, మణిపూర్ అల్లర్లు, సంభాల్‌లో హింస, వాయనాడ్ బాధితులకు సహాయం తదితర కీలక అంశాలపై చర్చ చేపట్టాలని ప్రతిపక్షం పట్టుబట్టింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు నినాదాలు చేయడంతో సభాధ్యక్ష స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ సంధ్య రాయ్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది. ప్రతిపక్ష సభ్యులు 267వ నిబంధన కింద పలు కీలక అంశాలపై చర్చకు ఇచ్చిన మొత్తం 13 నోటీసులను రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌కర్ తిరస్కరించారు. దీనితో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశాయి. నోటీసులను ఆమోదించే ప్రసక్తే లేదన్న ధన్‌కర్.. తొలుత సభను 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. అదానీ అంశంపై అత్యవసరంగా చర్చించాలంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఒక నోటీసు ఇచ్చారు. ఈ అంశం ప్రాముఖ్యాన్ని వివరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. ప్రపంచ స్థాయిలో భారత ప్రతిష్ఠ నాశనమైందని, అయినా ఇంకా అదానీకి ప్రధాని మోడీ మద్దతు పలుకుతున్నారని ఖర్గే విమర్శించారు. సభ ప్రొసీడింగ్స్‌ను పక్కనపెట్టి ఈ అంశంపై చర్చించేందుకు ధన్‌కర్ తిరస్కరించారు. ఖర్గే చెప్పిన మాటలు ఏవీ రికార్డుల్లోకి వెళ్లబోవని ప్రకటించారు. ఈ సమయంలో ప్రతిపక్ష సభ్యులు తమ నినాదాలను కొనసాగించడంతో రాజ్యసభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ ధన్‌కర్ ప్రకటించారు.

### ప్రజల తిరస్కారాన్ని పొందినవారు పార్లమెంటును నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు : మోడీ



కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారని, గందరగోళాలకు పాల్పడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. 80-90సార్లు ప్రజలు తిరస్కరించిన వారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం గూండాయిజాన్ని ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించారు. వారి వ్యూహాలు చివరకు విఫలమైనప్పటికీ, ప్రజలు వారి ప్రవర్తనను నిశితంగా గమనిస్తారని తెలిపారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని, ప్రతిపక్షాలపై పరోక్షంగా మండిపడ్డారు. నిరంతరం ప్రజలు తిరస్కరించే వారు తమ సహచరుల మాటలను విస్మరిస్తారని, ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ అగౌరవపరుస్తారని విమర్శించారు. పార్లమెంట్‌లో ఫలప్రదమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు.



## విద్యార్థిని శైలజ మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

పాఠశాలలో కలుషిత ఆహారం తిని గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కుమురంభీం జిల్లా వాంకిడి ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థిని శైలజ (16) మతి చెందింది. అక్టోబరు 30న పాఠశాలలో భోజనం చేసిన తర్వాత చాలా మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దాంతో వారందరినీ సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమించడంతో నవంబర్ 5న మెరుగైన వైద్యం కోసం పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు బాలికలు పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. మరో విద్యార్థిని శైలజకు అప్పటినుంచి వెంటిలేటర్‌పైనే చికిత్స అందిస్తూ వచ్చారు. పరిస్థితి విషమించడంతో బాలిక సోమవారం మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. విద్యార్థిని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మతురాలి తల్లి మాట్లాడుతూ కన్నీటి వీడ్కోలు పలకాలన్నా మనసు ఒప్పుకోవడం లేదని, ఒక్కగానొక్క కూతురును గారాబంగా పెంచడంతోపాటు విద్యలో రాణిస్తుందని హాస్టల్లో వేసినట్టు చెప్పారు. అంతలోనే ఇలా జరిగిందని కన్నీరు మున్నీరయ్యారు.

# అల్లుడు, అన్న, తమ్ముడి కోసమే రేవంత్ పనిచేస్తుండు.



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ధర్నా

**బలగం టీవీ, హైదరాబాద్**

అల్లుడు, అన్న, తమ్ముడి కోసమే రేవంత్ పనిచేస్తుండు.. ప్రజల కోసం కాదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబుతే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజక వర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు.

ఫార్మా విలేజ్ ఎవరి

మిగితా 3వ పేజీలో

## చపాతీ రోల్ గొంతులో ఇరుక్కుని విద్యార్థి మృతి..



**బలగం టీవీ, హైదరాబాద్**

చపాతీ రోల్ గొంతులో ఇరుక్కుని విద్యార్థి మతి చెందిన ఘటన హైదరాబాద్ బేగంపేట్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బేగంపేట ఇన్‌స్పెక్టర్ చిత్రా రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పాత బోయిగూడలో నివాసముండే గౌతమ్ జైన్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికి కుమారుడు విరెన్ జైన్(11), నిర్వి అనే ఏడేండ్ల పాప ఉన్నారు. విరేన్ జైన్ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సమీపంలోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం స్కూల్‌కు వెళ్లిన వీరేన్ జైన్ మధ్యాహ్నం సమయంలో మిగతా విద్యార్థులతో కలిసి లంచ్ చేస్తున్నాడు. లంచ్ బాక్సులో చపాతీలు తెచ్చుకున్ విరేన్ జైన్ ఒకేసారి మూడు చపాతీలను రోల్ చేసి తింటుండగా అవి గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడక విలవిలలాడాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు స్కూల్ టీచర్లకు చెప్పగా వెంటనే వారు బాలుడిని మారెడుపల్లిలోని గీతానర్సింగ్ హోమ్‌కు తరలించి బాలుడి తండ్రికి సమాచారం అందించారు. బాలుడి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అపోలో ఆస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మతిచెందినట్టు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## మలక్‌పేట్‌లో లా విద్యార్థిని అనుమానస్పద మృతి





**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ మలక్‌పేటలో లా విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మతి చెందింది. అయితే ఆమె పనిచేసే ఆఫీసులో ఉరేసుకుని కనిపించగా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తల్ పక్కన ఓ తాండకు చెందిన ఇస్లావత్ శ్రావ్య(22) హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని మహాత్మా గాంధీలా కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. అలాగే ఓ సీనియర్ అడ్వొకేట్ వద్ద జూనియర్‌గా ఉంటూ మూసారం బాగ్‌లోని ఓ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలో పార్ట్ టైమ్ జాబ్ చేస్తోంది. ఆదివారం రాత్రి ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ కార్యాలయంలో శ్రావ్య ఫాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. గమనించిన స్నేహితులు ఆమెను యశోద వైద్యశాలకు తీసుకువెళ్లారు. పరిశీలించిన వైద్యులు ఆమె మతి చెందినట్టు నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు.

విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు గిరిజన సంఘాల నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆందోళనకు దిగారు. ఉద్యోగావకాశాలు కల్పించే కార్యాలయంలో శ్రావ్యను యజమాని లైంగికదాడి చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూస్తున్నారని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని పోలీస్ స్టేషన్ ఎదుట రహదారిపై బైటాయించారు. దాంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వారి ఎంత నచ్చజెప్పినా వినలేదు. ఎట్టకేలకు ఏసిపి శ్యాంసుందర్ జోక్యం చేసుకొని వైద్యశాల నుంచి పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తరువాత బాధ్యులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. రిపోర్ట్ ఆధారంగా విచారణ చేపడతామని తెలిపారు. ఇప్పటికే అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని చెప్పటంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు. కూలి పనులు చేసి తమ కుమార్తెను చదివించామని లాయర్ చదువు పూర్తి చేసి కుటుంబానికి అండగా ఉంటుందనుకుంటే అనంత లోకాలకు వెళ్లిపోయిందని మృతురాలి కుటుంబసభ్యులు రోదించడం అక్కడున్న వారిని కలిచివేసింది.

# డిసెంబర్ 7న రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ 2024 డిసెంబర్ 7 న రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ ను నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం, ఎస్. అశోక్ (ఏఐటీయూసీ), , ఎం.ఎ.సలీమ్ (యుటీఎడీడబ్ల్యూ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), తదితరులు డిమాండ్ చేశారు. హైదరాబాద్, ఖైరతాబాద్ లోని ఆర్టీఏ కార్యాలయంలో సోమవారం ఆర్టీఏ జాయింట్ కమీషనర్ రమేష్ కు వారు సమ్మె నోటీసు అందజేశారు.తమ సమస్యలను పరిష్కరించాలని లెక్కలేనన్ని ధర్నాలు, ర్యాలీలు, పికెటింగ్ లు, వినతి పత్రాలు అందజేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తుం దని అందుకే ఒక రోజు ఆటో బంద్ నిర్వహిస్తున్నామని జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలు రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచాలని, మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాలని, గ్రేటర్ హైదరాబాద్ 20వేల కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను రూ.10లక్షలకు పెంచాలని అలాగే కాంగ్రెస్ తమ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి అర్హులైన ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని అయన డిమాండ్ చేసారు. డిసెంబర్ 7న జరిగే రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ భాగంగా హైదరాబాద్ లో లక్షమంది రవాణారంగా కార్మికులతో జేఏసీ నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభలో ప్రతి ఆటో కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలనీ విజ్ఞప్తి చేసారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో పాములు కలకలం

- బ్యాంకాక్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు మహిళల దగ్గర విషపూరితమైన పాములు

**బలగం టీవీ, హైదరాబాద్**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం పాముల కలకలం వెలుగులోకి వచ్చింది. బ్యాంకాక్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు మహిళల దగ్గర విషపూరితమైన పాములు ఉన్నట్టు అధికారులు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళలు బ్యాంకాక్ విమానాశ్రయం నుంచి పాములు తీసుకురాగా అక్కడ తనిఖీలు సరిగా చేయలేదా.. లేదా మహిళలు తనిఖీలు దాటి పాములు ఎలా తీసుకువచ్చారని అధికారులు ఆరా తీస్తున్నారు. ఆ మహిళలు పాములను ఎందుకు తీసుకువచ్చారు. ఈ ఫార్ములా వల్ల వారు చేస్తున్నది ఏమిటి? ఎన్ని రోజులుగా ఇలాంటి పనులకు వారు పాల్పడుతున్నారు.. అనే కోణంలో కస్టమ్స్ అధికారులు విచారణ చేపట్టారు.

పెండింగ్ బిల్లులను చెల్లించండి...

# కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటా...



- గ్రామపంచాయతీకి తాళం వేసి, మందు డబ్బాతో కాంట్రాక్టర్ ఆందోళన..

**బలగం టీవీ , గంభీరావుపేట**

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని గంభీరావుపేట మండల కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ భవనానికి కాంట్రాక్టర్, కోళ్ల మద్ది మాజీ సర్పంచ్ కేశవరావు సోమవారం తాళం వేసి, పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ గంభీ రావుపేట మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో 25 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ మరియు మరుగుదొడ్ల నిర్మాణం చేశానని అన్నారు. 12 లక్షల బిల్లులు ఇచ్చారని, ఇంకా 13 లక్షల బిల్లు పెండింగ్ లో ఉన్నాయని, అయినా మంత్రి పొన్నం ప్రభాకర్ చేత షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించామని అన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు నిధులు లేకపోవడంతో బిల్లులు రాలేవని అది కాంట్రాక్టర్ గా అర్థం చేసుకున్నానని అన్నారు. ఐదు నెలల క్రితం గ్రామపంచాయతీకి ఎస్ఎఫ్ఎస్ నిధులనుండి 10 లక్షలు జామ అయ్యాయని, మండలంలో నలుగురు కాంట్రాక్టర్లు ఉన్నామని మనిషికి కొంత ఇవ్వాలని డిపిఓ, జీపీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో రాజేందర్ రెడ్డి కు వినతి పత్రాలు ఇచ్చామని అన్నారు. స్పెషలాఫీసర్ రాజేందర్ రెడ్డి ఇప్పుడు ఇస్తా అప్పుడు ఇస్తానని మూడు రోజులు కాలయాపన చేశారనిఅన్నారు. మూడు రోజుల్లోపే ముగ్గురు కాంట్రాక్టర్ల వద్ద మనిషికి తల 50వేల రూపాయలు లంచం తీసుకొని, బిల్లులను మంజూరు చేశాడని ఆరోపించారు. నా బిల్లులు ఇవ్వాలని అడిగితే నీకు ఇవ్వ అని చెప్పడంతో గ్రామపంచాయతీలో అవినీతి జరిగిందని కలెక్టర్కు ఫిర్యాదు చేశానని అన్నారు. కలెక్టర్ కి ఫిర్యాదు చేయడంతో డిఎల్ పిఓ ను ఎంక్వయిరీ ఆదేశించారని,డి ఎల్ పి ఓ ఇచ్చిన ఎంక్వయిరీ రిపోర్టులో నా పెండింగ్ బిల్లులు 13 లక్షలు ఉన్నాయని, ఏ నిధులు అందుబాటులో ఉంటే ఆ నిధుల నుండి బిల్లులను మంజూరు చేయాలని ఎంక్వయిరీ రిపోర్టులో ఇచ్చాడని అన్నారు. ఎంక్వైరీ రిపోర్టు వచ్చి 14 రోజులు కావస్తున్నా బిల్లులు ఇవ్వడం లేదని, స్పెషలాఫీసర్, ఈవోను అడుగుతే మా మీదనే కంప్లైంట్ చేస్తావా ఇప్పుడు ఇస్తాం అప్పుడు ఇస్తామని దాటీ వేస్తున్నారని అన్నారు. గంభీరావు పేట గ్రామపంచాయతీలో జనరల్ ఫండ్ లో 15 లక్షలు రెండు నెలల నుంచి ఉన్నాయని, వాటీ నుండి బిల్లులను ఇవ్వక స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ రెడ్డి,ఈవో ఇబ్బందుల గురి చేస్తున్నారని ఆరోపించారు. బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులతో శతమాతమవుతున్నారని, వెంటనే బిల్లులు ఇవ్వాలని లేకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని అన్నారు.

# ఘనంగా ఎన్‌సీసీ డే వేడుకలు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాడెట్లు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ రెహనా ఇఫ్ఫత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . విద్యార్థులతో మాట్లాడుతూ ఎన్ సి సి లో చేరిన వారికి క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. విద్యార్థులందరూ సామాజిక సేవ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూష ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమంటూ పలు ప్రసంగాలు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# వెలమ వన మహోత్సవ వేడుకలు







**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో ఆదివారం వెలమ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక మాస వనభోజన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎక్కడెక్కడో ఉన్న అందరూ ఈరోజు గ్రామంలోని రోడ్ నెంబర్ 10 లో చేరుకొని, వన మహోత్సవంలో ఉసిరి చెట్టు కింద శాస్త్ర ప్రకారం పూజచేసుకొని, విష్ణు సహస్ర నామాలు పఠించి, విందు వినోదాలలో పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమంలో ముఖ్యంగా మహిళలు ఆనందోత్సవాల మధ్య సాయంత్రం వరకు గడిపారు. ఈ వేడుక ఆహ్వాన కార్యక్రమంలో వన మహోత్సవ వేడుక ప్రాధాన్యతను సలహాదారులుగా పీచర సంపత్ రావు అధ్యక్ష వహించి స్వాగత ఉపన్యాసము చేయగా ప్రధాన కార్యదర్శి డా. పిచర వేణుగోపాల్ రావు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యక్షులు పీచర నరేందర్ రావు మరియు బొమ్మెన రామ్ గోపాల్ రావు కోశాధికారి సంఘ లెక్కలను వివరించినారు. జాయింట్ సెక్రెటరీ పి. శ్రీనివాసరావు,ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. రవీందర్రావు పాటు వెలమ మహిళలు, పెద్దలు, పిల్లలు దాదాపు 300 మందితో కార్యక్రమం విందు వినోదాలతో ఘనంగా

# గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

- రిమాండ్ కు తరలింపు

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో ఓ వ్యక్తి గంజాయి అమ్ముతూ పోలీసుల పట్టుపడగా అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం బెజ్జంకి మండలం కన్నేపల్లి గ్రామానికి చెందిన పంబత్తి రాహుల్ అనే వ్యక్తి దుమాల గ్రామ శివారులో గంజాయ్ అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడు. ఎస్సై తన సిబ్బందితో వాహన తనిఖీ చేస్తుండగా పట్టుపడ్డాడు. అదుపులోకి తీసుకొని విచారించగా 70 గ్రాముల గంజాయి లభించడంతో మట్టి గంజాయిని సీజ్ చేసి అతడిని 15 రోజులు జ్యూడిషియల్ రిమాండ్కు తరలించడం జరిగిందని ఎస్ఐ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎవరైనా సరే మండలంలో గంజాయి అమ్మినా సరఫరా చేసిన సేవించినా తనిఖీలో పట్టు పడ్డట్లయితే శాఖ పరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

# బతుకుదెరువు కోసం గల్ఫ్ పయాణం..

- ఏజెంట్ మాటలు నమ్మి మోసపోయిన గల్ఫ్ బాధితుడు
- బలవంతంగా పనులు
- క్షీణించిన నరసింహుల ఆరోగ్యం
- అనారోగ్యం పాలైన తన భర్తను భారతదేశానికి రప్పించాలని ప్రభుత్వాన్ని అధికారులను వేడుకుంటున్న బాధితుని భార్య మంజుల



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన నరసింహులు బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన వ్యక్తి అనారోగ్యం పాలు కావడంతో భారతదేశానికి రప్పించాలని బాధితుని భార్య ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటుంది. వివరాలకు వెళితే మల్లాపూర్ గ్రామానికి చెందిన నరసింహులు ఓ ఏజెంట్ మాటలు నమ్మి సెక్యూరిటీ గార్డు ఉద్యోగం కోసమని మూడు లక్షల రూపాయలు అప్పు చేసి,9 నెలల క్రితం బహ్రెయిన్ దేశానికి బతుకుదెరువు కోసం వెళ్ళాడు. తీరా అక్కడికి వెళ్లాక అది విసిట్ వీసా అని, సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగం కాదని తెలిసింది. అంతేకాకుండా సదర్ ఏజెంట్ నరసింహులును అక్కడ రబ్బ ప్రాంతంలోని ప్యాలెస్ లో లేబర్ పనులకు నియమించాడు. ఈ విషయాన్ని నరసింహులు చరవాణిలో కుటుంబ సభ్యులకు అలాగే గ్రామస్తులకు తెలిపాడు. కొద్ది రోజుల తర్వాత అనారోగ్యం భారీన పడడంతో ఆయనను బలవంతంగా పనులు చేపిస్తున్నారని నర్సింలు ఏడుస్తూ చరవాణిలో భార్య మంజులకు, మరియు సింగిల్ విండో చైర్మన్ దుర్గా రెడ్డికి తెలిపాడు. దీంతో అనారోగ్యం పాలైన నా భర్త నరసింహులును భారతదేశానికి రప్పించాలని మంజుల ప్రభుత్వాన్ని మరియు అధికారులను వేడుకుంటుంది. దీంతోపాటు కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు ఎలాగైనా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి భారతదేశాకి రప్పించాలని కోరుతున్నారు. మల్లాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మాధవరెడ్డి మాట్లాడుతూ: ఏజెంట్ మాటలు నమ్మి నరసింహులు మోసపోయాడని, అతని ఆరోగ్యం రోజురోజు క్షీణిస్తుందని, ప్రభుత్వం మరియు అధికారులు వెంటనే చొరవ తీసుకొని భారతదేశానికి రప్పించాలని కొరుతున్నారు.




# మట్టిని తరలిస్తున్న వ్యక్తుల పై కేసు నమోదు

- ఎస్ఐ రామ్మోహన్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ అనుమతులు లేకుండా లేకుండా జేసీబీ ద్వారా మట్టిని తరలిస్తున్న మూడు ట్రిప్పర్లను ఒక జెసిబి ని సీజ్ చేశారు. గరిపల్లి ఎంకన్న ఏ1 పర్స లచ్చయ్య ఎ2 జలపతి కృష్ణ ఏ3 కందుకూరు సాయి డ్రైవర్ ఏ4 లపై కేసు నమోదు చేశామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

# అల్లుడు, అన్న, తమ్ముడి కోసమే రేవంత్ పనిచేస్తుండు.

(మొదటి పేజీ తరువాయి)

కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం

లేదని విమర్శించారు. మరో 10 రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది అవుతుందని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 420 హామీలు ఇచ్చారా? ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడున్న డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు.

మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

# డిజైన్ కాంపిటేషన్ "హెరిటేజ్ పునరుజ్జీవనం"

**బలగం టీవి, హైదరాబాద్**

డిపార్ట్మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ అండ్ డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (డీహెచ్ఎటీ) హైదరాబాద్‌లో జెబిఆర్ ఆర్కిటెక్చర్ కాలేజ్ సహకారంతో నవంబర్ 21 నుండి 25 వరకు నిర్వహించిన వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ ముగింపు సంధర్భంగా వారసత్వ పరిరక్షణలో యువతను నిమగ్నం చేయడమే లక్ష్యంగా, గ్రాడ్యుయేట్ ఆర్కిటెక్చర్ విద్యార్థుల కోసం "పునరుజ్జీవన వారసత్వం: ముదుమల్ మెగాలిథిక్ మెంహిర్స్" పేరుతో డిజైన్ పోటీని నిర్వహించారు. సోమవారం అవార్డుల ప్రదానోత్సవంతో కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలను సత్కరించారు. హాజరైన వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ లను ప్రదానం చేశారు. హెరిటేజ్ తెలంగాణ ప్రభుత్వం వైఎటీసీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్.శ్రీధర్ మార్గదర్శకాలను అనుసరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ తెలంగాణ శాఖ 2 బ్రోచర్లు "సెంటినరీ హెరిటేజ్ మ్యూజియం", బౌద్ధుల సైట్ మ్యూజియం, ఫణిగిరి" విడుదలచేశారు. ఈ కార్యక్రమానికి డీహెచ్ఎటీ చైర్మన్ ఈఆర్ వేదకుమార్ మణికొండ అధ్యక్షత వహించారు.

డైరెక్టర్ .నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్, హెరిటేజ్ తెలంగాణ విభాగం, డాక్టర్ ఇ.శివనాగిరెడ్డి, "సిఇఒ-ప్లీచ్ ఇండియా", ఇంటాక్ న్యూఢిల్లీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ దీపేంద్ర శర్మ, కోటయ్య వింజ మూరి, ఏఎస్ఐ. అసిస్టెంట్ ప్రొఫెసర్, జయశ్రీ, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్ పి.- అనురాధారెడ్డి, కన్వీనర్, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్. ఈఆర్ వేదకుమార్ మణికొండ తన ప్రసంగంలో ముదుమాల్ మహారాతియుగం మెనిర్స్ సైట్ యొక్క విశిష్టమైన సార్వత్రిక విలువను (ఓయువి), దాని చారిత్రక సాంస్కృతిక ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో ఈ ప్రదేశాన్ని చేర్చే లక్ష్యంతో పరిశోధన, డాక్యుమెంటేషన్, సంరక్షణ అధ్యయనాలను నిర్వహించడంలో తెలంగాణ వారసత్వ శాఖ, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (డిహెచ్ఎటి) యొక్క సహకార ప్రయత్నాలను ఆయన వివరించారు. తెలంగాణ సాంస్కృతిక ఔన్నత్యాన్ని ప్రశంసించిన డాక్టర్ దీపేంద్ర శర్మ రాష్ట్ర వారసత్వాన్ని పరిరక్షించడంలో తెలంగాణ వారసత్వ శాఖ చురుకైన చర్యలను అభినందించారు. డాక్టర్ ఇ.శివనాగిరెడ్డి వారసత్వ సంపదగా తెలంగాణ సాంస్కృతిక ప్రాముఖ్యతను చెప్పారు. హెరిటేజ్ తెలంగాణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్ సభికులకు ధన్యవాదం తెలిపారు.

# బంజారాహిల్స్‌లో ఆపరేషన్ రోప్

**బలగం టీవి, హైదరాబాద్**



రోడ్ల ఆక్రమణలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అక్రమ పార్కింగ్, రోడ్లను ఆక్రమించుకుని చేసే వ్యాపారలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెస్ట్ జోన్ పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ హరి ప్రసాద్ అన్నారు. బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ గౌడ్,ఇతర పోలీసు అధికారులతో కలిసి సీపీ ఆదేశాలతో గత కొన్ని రోజులుగా కొనసాగిస్తున్న రోప్ స్పెషల్ డ్రైవ్ సోమవారం నిర్వహించారు.టోటల్ ఆక్రమించుకొని వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారులకు తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో భాగంగా సోమవారం గతంలో నిర్వహించిన డ్రైవ్ లో కేసులు నమోదు చేసుకున్న వారు సైతం సామాగ్రిని వ్యాపారాలను యధాతథంగా కొనసాగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ సామాగ్రిని వాహనంలో తీసుకెళ్లారు.



## బెంజ్ కారు బీభత్సం

**బలగం టీవి, హైదరాబాద్**

బంజారాహిల్స్‌లో బెంజ్ కారు బీభత్సం సృష్టించింది. సోమవారం ఉదయం అతివేగంగా దూసుకొచ్చిన కారు బంజారాహిల్స్ 10/1 సిటీ సెంటర్ షాపింగ్‌మాల్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో కారును నడుపుతున్న మహిళ క్షేమంగా బయటపడ్డారు. ఆమె బయటకు వచ్చేలా వాహనదారులు సహాయం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్రేన్ సహకారంతో వారు వాహనాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కారు నడిపిన మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కారు నడిపిన మహిళ మద్యం మత్తులో ఉన్నట్టు భావిస్తున్నారు.

# 'రేవంత్ సారు.. నా భూమి నాకు ఇప్పించండి'

**బలగం టీవి, హైదరాబాద్**




"రేవంత్ సారు నా తల్లి నుంచి వారసత్వంగా వచ్చిన రెండెకరాల 10 గుంటల స్థలాన్ని నాకు ఇప్పించాలి" అని ఓ 84 ఏండ్ల వద్ధురాలు వేడుకంది.సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వద్ధురాలు సావిత్రమ్మ ఆమె గోడును మీడియాకు ముందు వెల్లబోసుకుంది. నల్లగొండ జిల్లా దామచర్ల మండలం ఇరికి గూడెం సర్వేనెంబర్ 11/105 లో రెండు ఎకరాల 10 గుంటల స్థలం తమకు ఉందని తెలిపారు. తన తల్లి కొటిక లచ్చమ్మ నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని 2020 వరకు సాగు చేసినట్టు చెప్పారు. అనంతరం ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు అండతో స్థానిక కాంగ్రెస్ నేతలు తన భూమిపై నకిలీ దస్తావేజులు సృష్టించి అక్రమంగా స్వాధీనం చేసుకోనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వంగా వచ్చిన భూమి ని ఎలా దోచుకుంటారని ప్రశ్నిస్తే తనపై, మానసిక సమస్యతో బాధపడుతున్న తన కుమారుడిపై తీవ్రంగా దాడులకు తెగబడ్డారని కన్నీరు పెట్టుకుంది. ఈ అంశంపై నల్లగొండ రెవిన్యూ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయగా సమగ్ర విచారణ జరిపి న్యాయం జరిపించాలని ఆదేశించారని తెలిపింది. తనకు న్యాయం చేయాలని దామరచర్ల ఎమ్మార్వో జవహర్ లాల్‌కు మొర పెట్టుకోగా రూ.5 లక్షల వరకు లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ విలపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దష్టి సారించి వృద్ధురాలైన తనకు న్యాయం చేయాలని కోరింది.

# మిడ్ డే మీల్స్ తయారీ కేంద్రం తనిఖీ

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే మిడ్ డే మీల్స్ తయారీ కేంద్రాన్ని సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఉప్పల్‌లో ఉన్న మన్నా ట్రస్ట్ ద్వారా రోజు 80వేల మంది విద్యార్థులకు మిడ్ డే మీల్స్ వండి ప్యాక్ చేసి అందించే కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. భోజనం వండే విభాగాన్ని, స్టోరేజ్ రూంను, గోడౌన్ ను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు ఎంత మంది విద్యార్థులకు భోజనం అందజేస్తారనీ, ఎప్పటి నుంచి వంట మొద ెలు పెడతారని కేంద్ర నిర్వాహకులు రమణారెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుక ున్నారు. పౌష్టికమైన, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే వంట సామాగ్రిని ఎవరు సరఫరా చేస్తారనీ, నాణ్యమైన సామాగ్రిని వాడాలనీ, ఎక్స్పైరీ డేట్ చెక్ చేయాలని కలెక్టర్ సూచించారు వంట సామాగ్రిని తడి లేకుండా జాగ్రత్తగా భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఉప్పల్ తహశీల్దార్ వాణి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, సంబంధిత అధికారులు ఉన్నారు.

# జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 126 ధరఖాస్తులు

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి వారి సమస్య లను అడుగుతూ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భ ంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 3 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 46 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 21, ఎఫ్.ఏ, హెల్త్ విభాగాలకు 5 చొప్పున, ఎలక్ట్రికల్ విభాగానికి 4, స్పోర్ట్స్, సీ.ఇ మెయింటెనెన్స్, ఎస్టేట్, ఎల్.డబ్ల్యు.ఎస్, హౌసింగ్ విభాగాలకు రెండు చొప్పున, విజిలెన్స్ విభాగానికి ఒక్క ఫిర్యాదు అందింది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 33, శేరిలింగంపల్లి జోన్ లో 9, ఎల్బీనగర్ జోన్ లో 14, సికింద్రాబాద్ జోన్ లో 21, చార్మినార్ జోన్ లో 3 ఫిర్యాదులు రాగా, ఖైరతాబాద్ జోన్ లో ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, పంకజ, సరోజ, రఘు ప్రసాద్, సత్యనారాయణ, సుభద్ర దేవి, చంద్రకాంత్ రెడ్డి, సీఈ దేవానంద్, కోటేశ్వర రావు, అడిషనల్ సిసిపి లు గంగాధర్, ప్రదీప్, సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, జాయింట్ కమిషనర్లు మహేష్ కులకర్ణి, హౌసింగ్ ఎస్ఈ కష్టారావు పీవీ రమణ రాజేశ్వర్ రావు, వాటర్ వర్క్స్ జీ.ఎం.సాయి రమణ ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# తొలి టెస్టు భారత్‌దే...

## 295 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు



**బలగం టీవీ, పెర్త్**

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత జట్టు ఘన విజయం సాధించింది. 295 పరుగుల తేడాతో రికార్డు విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌లో సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 534 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 238 పరుగులకు కుప్పకూలింది. మ్యాచ్‌లో 8 వికెట్లు తీసి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ జస్‌ప్రిత్ బుమ్రాకు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

ఓవర్ నైట్ స్కోరు 12/3తో సోమవారం నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. రెండో ఓవర్‌లోనే ఉస్మాన్ ఖ్వాజా (4) ఔటయ్యాడు. అతన్ని సిరాజ్ వెనక్కి పంపాడు. దీంతో ఆస్ట్రేలియా 17 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో స్టీవ్ స్మిత్‌తో కలిసి ట్రావిస్ హెడ్ కొద్ది సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. స్మిత్ తన మార్క్ డిఫెన్స్‌తో వికెట్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నించాడు. హెడ్ మాత్రం దూకుడును ప్రదర్శించాడు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన స్మిత్ 60 బంతుల్లో 17 పరుగులు చేసి సిరాజ్ చేతికి చిక్కాడు.స్మిత్ ఔటైనా హెడ్ తన పోరాటం కొనసాగించాడు. అతనికి మిచెల్ మార్ష్ అండగా నిలిచాడు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కానీ 101 బంతుల్లో 8 బౌండరీలతో 89 పరుగులు చేసిన హెడ్‌ను బుమ్రా ఔట్ చేశాడు. దీంతో 82 పరుగుల ఆరో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ అలెక్స్ కారె కూడా కుదురుగా ఆడాడు. ఇక కీలక ఇన్నింగ్స్ ఆడిన మార్ష్ 67 బంతుల్లో రెండు సిక్సర్లు, మూడు ఫోర్లతో 47 పరుగులు చేసి తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి వేసిన అద్భుత బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు.

తర్వాత వచ్చిన మిచెల్ స్టార్క్ కొద్ది సేపు వికెట్లను కాపాడుకునేందుకు ప్రయత్నించాడు. అయితే 35 బంతుల్లో 12 పరుగులు చేసిన అతన్ని వాషింగ్టన్ సుందర్ ఔట్ చేశాడు. ఆ వెంటనే నాథన్ లియాన్‌ని కూడా సుందర్ వెనక్కి పంపాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన అలెక్స్ 2 ఫోర్లతో 36 పరుగులు చేసి హర్షిత్ రాణా బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 58.4 ఓవర్లలో 238 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో బుమ్రా, సిరాజ్ మూడేసి వికెట్లను పడగొట్టారు. వాషింగ్టన్‌కు రెండు, హర్షిత్, నితీశ్‌లకు చెరో వికెట్ లభించింది. కాగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా 104 పరుగులకే కుప్పకూలగా టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 487 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది.

# ముగిసిన ఐపీఎల్ వేలం..



**బలగం టీవీ, దుబాయ్**

జెడ్డా వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ఐపీఎల్ మెగా వేలం 2025 ముగిసింది. మొత్తం 182 మంది ప్లేయర్లు ఈ మెగా వేలంలో అమ్ముడయ్యారు. ఇందులో 62 మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. ఫ్రాంచైజీలు అన్నీ కలిసి ప్లేయర్ల కోసం రూ. 639.15 కోట్లు ఖర్చు చేశాయి. రిషభ్ పంత్ రూ. 27 కోట్లతో రికార్డు ధర పలకగా.. శ్రేయస్ అయ్యర్ రూ. 26.75 కోట్లతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన రెండో ప్లేయర్ గా నిలిచాడు. అనూహ్యంగా వెంకటేశ్ అయ్యర్ ను కేకేఆర్ రూ. 23.75 కోట్లకు సొంతం చేసుకుంది.

తొలి రోజు పంత్, అయ్యర్ వంటి స్టార్లు ఐపీఎల్ వేలం రికార్డులను బద్దలు కొడితే.. రెండో రోజు కుర్రాళ్ల పంట పండింది. ఫ్రాంచైజీలు యువ క్రికెటర్లపై కోట్లు కుమ్మరించాయి. పలువురిని ఊహించని ధర పలికింది. రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన కుర్రాళ్లు కోటీశ్వరులయ్యారు. రెండో రోజు సీనియర్ పేసర్ భువనేశ్వర్ రూ.10.75 కోట్లతో అత్యధిక ధర పలికాడు. అలాగే, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, అశుతోష్ శర్మ, రఘువంశీ, రసిఖ్ దర్ వంటి యువకులు భారీ ధర పలికారు.

రెండో రోజు 110 మందిని ఫ్రాంచైజీలు దక్కించుకున్నాయి. రెండో రోజు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ అత్యధిక ధర పలికాడు. అతన్ని బెంగళూరు రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. యువ పేసర్ ఆకాశ్ దీప్ కోసం లక్నో రూ. 8 కోట్లు పెట్టింది. 2022 వేలంలో ఆర్సీబీ అతన్ని రూ. 20 లక్షలకే తీసుకుంది. మరో యువ పేసర్ రసిఖ్ ధర్‌కు భారీ ధర దక్కింది. అతన్ని రూ. 6 కోట్లకు ఆర్సీబీ కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో సత్తాచాటిన అశుతోష్ శర్మను రూ.3.80 కోట్లకు ఢిల్లీ, రఘువంశీని రూ. 3 కోట్లకు కోల్‌కతా జట్టులోకి తీసుకు న్నాయి. బౌలర్ అన్షుల్ కాంబోజ్‌ను చెన్నయ్ రూ3.40 కోట్లకు దక్కించుకుంది. అయితే, భారీ ధర పలుకుతాడనుకున్న వాషింగ్టన్ సుందర్‌ను గుజరాత్ రూ.3.2 కోట్లకే దక్కించుకుంది. డు ప్లెసిస్ కోసం ఆర్సీబీ ఆర్‌టీఎం వాడలేదు. అతన్ని ఢిల్లీ రూ. 2 కోట్లకు తీసుకుంది. కృనాల్ పాండ్యాను రూ. 5.75 కోట్లకు ఆర్సీబీ, నితీశ్ రాణాను రూ 4.2 కోట్లకు రాజస్థాన్ కొనుగోలు చేశాయి. విదేశీ ప్లేయర్లలో సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్(రూ. 7కోట్లు, పంజాబ్) రెండో రోజు అత్యధిక ధర పలికాడు.

## ఐపీఎల్ వేలం ముగిసింది.. పూర్తి జట్లు ఇవే...

**బలగం టీవీ, దుబాయ్**

**సన్ రైజర్స్ హైదరాబాద్**

ప్యాట్ కమిన్స్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డి, ఇషాన్ కిషన్, షమీ, అభినవ్ మనోహర్, రాహుల్ చహర్, ఆడం జంపా, సిమర్ జీత్ సింగ్, ఇషాన్ మలింగ, బ్రైడన్ కర్సె, జైదేవ్ ఉనాద్కట్, మెండీస్చ జీషన్ అన్సారి, సచిన్ బేబి, అనికేత్ వర్మ, అథర్వ

**చెన్నై సూపర్ కింగ్స్**

రుతురాజ్ గైక్వాడ్, ఎంఎస్ ధోని, రవీంద్ర జడేజా, శివమ్ దూబే, నూర్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్, కాన్వే, ఖలీల్ అహ్మద్, రచిన్ రవీంద్ర, అన్షుల్ కంబోజ్, రాహుల్ త్రిపాఠి, స్యామ్ కరణ్, గుర్జప్ నీత్ సింగ్, నాథన్ ఎల్లీస్, దీపక్ హుడా, జెమీ ఓవర్టన్, విజయ్ శంకర్, వాన్ష్ బేడి, అంద్రీ సిద్ధార్థ్, శ్రేయస్ గోపాల్, రామకృష్ణ ఘోష్, కమలేష్ నాగర్ కోటి, ముకేశ్ చౌదరీ, షేక్ రషీద్, పతిరణ

**ఢిల్లీ క్యాపిటల్స్**

అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, స్టబ్స్, పొరెల్, కేఎల్ రాహుల్, స్టార్క్, నటరాజన్, జేక్ ప్రసెర్ మెక్ గర్, ముకేశ్ కుమార్, హ్యారీ బ్రూక్, అశుతోష్ శర్మ, మోహిత్ శర్మ, ఫాఫ్ డు ప్లెసిస్, సమీర్ రిజ్వి, ఫెరీరా, దుష్మంత చమీర, విప్రాజ్ నిగమ్, కరుణ్ నాయర్, మాదవ్ తివారి, త్రిపురణ విజయ్, మన్వంత్ కుమార్, అజయ్ మందల్, దర్శన్ నల్కండే

**గుజరాత్ టైటాన్స్**

రషీద్ ఖాన్, శుబ్ మన్ గిల్, షారుఖ్ ఖాన్, సాయి సుదర్శన్, తెవాటియా, జాస్ బట్లర్, సిరాజ్, రబడ, ప్రసిద్ధ్ కృష్ణ, సుందర్, రూథర్ ఫోర్డ్, కొట్జీ, ఫిలిప్స్, సాయి కిషోర్, మహిపాల్ లొమ్రోర్, గుర్నూర్ సంగ్, అర్షద్ ఖాన్, కరిమ్ జనత్, జయంత్ యాదవ్, ఇషాంత్ శర్మ, కుమార్ కుషాగ్ర, కుల్వంత్, మానవ్ సుతార్, అనుజ్ రావత్, నిషాంత్ సందూ

**కేకేఆర్**

రింకూ సింగ్, రస్సెల్, నరైన్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, రమణ్ దీప్ సింగ్, వెంకటేశ్ అయ్యర్, అన్రిచ్ నోకియా, డికాక్, రఘువంశీ, స్పెన్సర్ జాన్సన్, మొయిన్ అలీ, గుర్బాజ్, వైభవ్ అరోరా, అజింక్యా రహానే, రోవ్ మన్ పావెల్, ఉమ్రాన్ మాలిక్, మనీశ్ పాండే, అంకుల్ రాయ్, సిసోడియా, మయాంక్ మార?ండే

**లక్నో సూపర్ జెయింట్స్**

నికోలస్ పూరన్, ఆయుశ్ బదోని, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్, మొహ్సిన్ ఖాన్, రిషభ్ పంత్, అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్, డేవిడ్ మిల్లర్, అబ్దుల్ సమద్, మిచెల్ మార్ష్, షాబాజ్ అహ్మద్, మార్క్రమ్, మ్యాథ్యూ, జోసెఫ్, సిద్ధార్థ్, కులకర్ణి, రాజవర్ధన్ హంగార్గెకర్, యువ్‌రాజ్ చౌదరీ, ప్రిన్స్ యాదవ్, ఆకాశ్ సింగ్, దిగ్వేష్ సింగ్, హిమ్మత్ సింగ్, ఆర్యన్ జుయల్

**ముంబై ఇండియన్స్**

బుమ్రా, హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, బౌల్ట్, దీపక్ చహర్, విల్ జాక్స్, నమన్ దీర్, అల్లా ఘజనఫర్, సాంట్నెర్, రయాన్ రికెల్టన్, లిజార్డ్ విలియమ్స్, రీస్ టాప్లీ, రాబిన్ మింజ్, కరణ్ శర్మ, విగ్నేశ్, అర్జున్ టెండూల్కర్, బెవాన్ జాన్ జాకబ్స్, రాజ్ అగద్ బవ, కృష్ణన్, అశ్వణి కుమార్

**పంజాబ్ కింగ్స్**

శశాంక్ సింగ్, ప్రభ్ సిమ్రన్ సింగ్, శ్రేయస్ అయ్యర్, చహల్, అర్ష దీప్ సింగ్, స్టొయినిస్, మార్కో యాన్సెన్, నేహాల్ వదేరా, గ్లెన్ మ్యాక్స్ వెల్, ప్రియాన్ష ఆర్య, జాష్ ఇంగ్లీస్, అజ్మతుల్లా, ఫెర్గూసన్, వైశాక్ విజయ్ కుమార్, యశ్ ఠాకూర్, హర్ ప్రీత్ బ్రార్, ఆరోన్ హార్డీ, విష్ణు వినోద్, జవియర్, కుల్దీప్ సేన్, ప్రవీన్ దూబే, అవినాశ్, సూర్యాన్ష ముషీర్ ఖాన్, హర్నూర్ పన్ను

**రాజస్తాన్ రాయల్స్**

సంజూ సామ్సన్, యశస్వీ జైస్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జెరెల్, హెట్ మైర్, సందీప్ శర్మ, ఆర్చర్, తుసార్ దేశ్ పాండే, హసరంగ, తీక్షణ, నితీశ్ రాణా, ఫరూఖీ, మఫాక, ఆకాశ్ మద్వల్, వైభవ్ సూర్యవంశీ, శుభమ్ దూబె, యుద్వీర్ చరక్, అశోక్ శర్మ, కునాల్ రాథోర్, కుమార్ కార్తికేయ సింగ్

**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు**

విరాట్ కోహ్లీ, రజత్ పటిదార్, యశ్ దయాల్, హేజల్ వుడ్, ఫిల్ సాల్ట్, జితేశ్ శర్మ, భువనేశ్వర్ కుమార్, లవింగ్ స్టోన్, రాసిఖ్ ధార్, కృనాల్ పాండ్యా, టిమ్ డేవిడ్, జాకబ్ బెతెల్, సూయాశ్ శర్మ, దేవ్ దత్ పడిక్కల్, నువాన్ తుషార, రొమారియో షెపర్డ్, ఎంగిడి, స్వప్నిల్ సింగ్, మోహిత్ రాథీ, అభినందన్ సింగ్, స్వస్తిక్ చికార, మనోజ్

## 13 ఏళ్ల కుర్రాడికి జాక్ పాట్.. ఏకంగా రూ.1.10 కోట్లు!

**బలగం టీవీ, దుబాయ్**



2025 ఐపీఎల్ మెగా వేలంలో సంచలనం జరిగింది. 13ఏండ్ల బిహార్ కుర్రాడు వేలంలో భారీ ధర దక్కించుకున్నాడు. రు. 30 లక్షల బేస్ ప్రైజ్‌తో వేలంలోకి వచ్చిన ఆ కుర్రాడిని రాజస్థాన్ రాయల్స్ రూ.1.10 కోట్లకు కొనుగోలు చేసింది. ఒకవేళ తుది జట్టులో చోటు దక్కితే ఐపీఎల్‌లో ఆడనున్న అతిపిన్న వయస్కుడిగానూ రికార్డు కొడతాడు.

బిహార్‌కు చెందిన 13ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన పేరును రూ. 30 లక్షల బేస్ ప్రైజ్‌తో మెగా వేలంలో రిజిస్టర్ చేసుకున్నాడు. వేలం షార్ట్ లిస్ట్‌లో తన పేరు కూడా ఎంపికైంది. ఇక తాజా వేలంలో వైభవ్ సూర్యవంశీ మంచి ధర పలికాడు. కనీస ధర రూ.30 లక్షల వద్ద ప్రారంభమైన బిడ్డింగ్‌లో వైభవ్ కోసం రాజస్థాన్, ఢిల్లీ పోటీపడ్డాయి. చివరికి అతడిని రూ.1.10 కోట్లకు రాజస్థాన్ తీసుకుంది. దీంతో ఐపీఎల్ వేలంలో నిలిచిన, అమ్ముడైన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డులకెక్కాడు.